

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

తుపాన్ ప్రభావంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ సిహెచ్.నాగ నరసింహరావు ఆదేశించారు. నగరంలోని ఎన్ఎఫ్‌సిఎల్, రేచర్ల పేట, రైల్వేడ్రయిన్, కల్పన సెంటర్, సినిమా రోడ్డులోని నగర పాలక సంస్థ కార్యాలయం, మెయిన్ రోడ్డు, సంజయ్ నగర్, దుమ్ముల పేట ప్రాంతాల్లో ఆయన మంగళవారం హోరున కురుస్తున్న వర్షంలోనూ క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. అవుట్ లెట్లు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా నీరు నిలిచిపోతే తక్షణమే మోటర్లతో ఎత్తిపోయాలన్నారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఒను ఆదేశించారు. పునరావస కేంద్రాల్లో కల్పించిన వసతులను పర్యవేక్షించారు.

ముంచిన మిచౌంగ్

- నిండా మునిగిన అన్నదాత
- మూడు రోజులుగా వదలని వానలు
- తడిసి ముద్దయిన ధాన్యం
- తుఫాను ప్రభావంతో అల్లాడుతున్న తీర గ్రామాలు
- వేట లేక ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు

తుపాను జిల్లాలో కల్లోలాన్ని సృష్టించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు నిండా మునిగారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని అష్ట కష్టాలు పడిన రైతులు పంట చేతికొచ్చే సమయంలో నష్టాల భారిన పడ్డారు. కోత కోయకుండా ఉండిపోయిన వరి అనేక చోట్ల భారీ ఈదురు గాలులకు నేలకొరిగి పోయింది. పనలపై ఉన్న పంట రైతన్నలకు కన్నీటిని రప్పిస్తోంది.



సామర్లకోట రూరల్‌లో ఈదురుగాలులకు నేల కొరిగిన వరి పంట

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ సృష్టించిన కల్లోలంతో జిల్లా ప్రజలు వణికిపోయారు. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల వద్ద తీరం దాటిన ప్రభావంతో వీచిన ఈదురుగాలులతో తీరం ప్రాంతం హడలెత్తిపోయింది. తీరప్రాంతంతోపాటు, ఇతర మైదాన ప్రాంతాల్లోనూ విధ్వంసాన్ని సృష్టించింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. పలు గ్రామాల్లో పూరిల్లు, పెంకిటిల్లుల పైకప్పులు గాలిలో ఎగిరిపడ్డాయి. పంట చేతికొచ్చే సమయంలో ముంచుకొచ్చిన తుపాన్ ప్రభావంతో వేల ఎకరాల్లో వరి పంట నీటి పాల్జేసింది. పనలపై ఉన్న పంటతోపాటు, రాసులుగా పోసి భద్రపర్చుకున్న ధాన్యం సైతం నీటి పాలు అయ్యింది. జిల్లాలో 2.6 లక్షల ఎకరాల్లో వరి సాగగా, 1.32 లక్షల ఎకరాల్లో కోతలు కోసి పంటను ఒబ్బిడి చేసుకున్నారు. సుమారు 74 వేల ఎకరాల్లో పంటను కోసేందుకు రైతులు సిద్ధమయ్యారు. యు.కొత్తపల్లి, పిఠాపురం, కరప, కాజులూరు, తాళ్లరేవు, సామర్లకోట, పెద్దాపురం తదితర మండలాల్లో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈదుర గాలులకు సుమారు 8 వేల ఎకరాల్లో వరి పంట నెలకొరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 1500 ఎకరాల్లో పనల మీద ఉన్న పంట నీటిలో మినిగిపోయింది.

90-100 కి.మీ వేగంతో ఈదురుగాలులు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో తీరం వెంబడి గంటకు 90–110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో యు. కొత్తపల్లి, తాళ్లరేవు, కాకినాడ రూరల్ తదితర తీరప్రాంత గ్రామాల ప్రజలు భయం భయంగా గడిపారు. యు.కొత్తపల్లి మండలం కొండెవరం శివారు ఇంద్రానగర్లో భారీ ఈదుర గాలులకు 40 ఇళ్లకు పైకప్పులు ధ్వంసం అయ్యాయి. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కాకినాడ రూరల్ వలసపాకల, వాకలపూడి రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు వైర్లు తెగి పడి ఒక గేదె మృతి చెందింది. **జగ్గంపేట రూరల్** తుపాన్ ప్రభావం మండలంలో విస్తారంగా వర్షం కురిసింది. వర్షం కారణంగా రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండలంలో సాగుచేసిన యంత్రాల ద్వారా కోతలు కోయడంతో తేమ శాతం అధికంగా ఉండటంతో ధాన్యంను రోడ్లపై ఆరబోసుకున్నారు. అయితే ఇప్పటి వరక 447 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు తరలించామని, ఇంకా కళ్లాల్లో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని ఎఒ శ్రీరామ్ వెల్లడించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఆ ధాన్యంను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో పలు ముంపు ప్రాంతాల్లో ఆర్‌డిఓ సీతారామారావు పర్యటిం చారు. **యు.కొత్తపల్లి** తుపాన్ ప్రభావంతో ఉప్పాడ, కోనపాప పేట, సూరంపేట, మయపట్నం, మూలపేట గ్రామాలు రాకాసి అలలు తాకడంతో పలు గృహాలు సముద్ర కోతకు గురయ్యాయి. ఈదురు గాలులతో పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 10 పెంకుటిల్లులు ధ్వంసం అయ్యాయి. తుపాన్ ప్రభావంతో అల్లకొల్లాలంగా ఉన్న తీర ప్రాంతాన్ని ఎంఎల్ఎ పెండెం దొరబాబు మంగళవారం పర్యటించారు. అలాగే ఉప్పాడ సముద్ర తీరాన్ని ఎస్‌పి సతీష్ కుమార్ పరిశీలించారు. అలాగే మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. పలువురు బాధిత కుటుంబాలను కలుసుకుని ఓదార్చారు. **గండేపల్లి** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. అలగే వేరుశనగ, మినప పంట సాగు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. **రౌతులపూడి** ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా పంట పొలాలు నీట మునిగాయి. మండల తహశీల్దార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఈశ్వరరావు పలుప్రాంతాల్లో పర్యటించారు. **గండేపల్లి** మండలంలోని మల్లేపల్లి గ్రామంలో సుడిగుండం విలయతాండవం సృష్టించింది. జాతీయ రహదారిలో ఉన్న పెట్రోల్ బంకు చుట్టుపక్కల పొలాల్లో సుడిగాలి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ సుడిగాలికి 3 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగి నేలకొరిగాయి. **సామర్లకోట రూరల్** మండల పరిధిలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సామర్లకోట జగనన్న కాలనీలో డ్రయిన్ల సదుపాయం పూర్తిస్థాయిలో లేకపోవడంతోకాలనీ అంతా జలమయమైంది. పట్టణ పరిధిలో జగనన్న కాలనీ, భాస్కర్ నగర్ కాలనీ, సాయి నగర్, తెనుకుల పుంత, ఆర్‌టిసి బస్టాండ్, ప్రెసిడెంట్ గారి వీధి, వెలమ వీధి తదితర ప్రాంతాలు భారీ వర్షాలకు జలమయ్యాయి. అలాగే పట్టణంలోని 31వ వార్డు భాస్కర్ కాలనీలో వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ ముంపు బాధిత కుటుంబాలకు వారం రోజులకు సరిపడా కూరగాయలు, కిరాణా సరుకులు, పాలును ఎస్‌కె బాయ్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. **కిర్లంపూడి** మండలంలో పలు గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. పంట పొలాల్లో మోకాలి లోతులో నీళ్ళు చేరాయి. ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లోని పంట కళ్లాల్లోనే ఉంది. కోత కోయాల్సిన పంటతోపాటు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాసులు నీట మునిగాయి. **జగ్గంపేట రూరల్** మండలంలో ఈదురు గాలులతోపాటు కుండ పోత వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా కురిసిన వర్షం 40.4 శాతం నమోదు అయిందని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఈ గాలులతో కూడిన వర్షం వల్ల పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే జగ్గంపేట మెయిన్ రోడ్ నిర్మానుష్యంగా మారింది. వ్యాపారస్తులు, ప్రజలు తమ ఇళ్లకే పరిమితమయ్యారు. **తాళ్లరేవు** మండలంలోని పలు ప్రాంతాల్లో రైతాంగం జాగ్రత్త చేసిన ధాన్యం రాశులను ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే మండలంలో నెలకున్న పరిస్థితులపై ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ సమీక్షించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్ట పరిహారంపై నివేదికను తయారు చేయాలని అన్నారు. కూలిన తాటాకు ఇళ్లకు నష్ట పరిహారాన్ని 48 గంటల్లోగా ఇవ్వాలని ఆదేశించారు. **కరప** తుపాన్ ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షం పడింది. ఈదురుగాలులకు వరి పొలాలు నేలనం టాయి. రాశులుగా పోసి బరకాలతో భద్రపర్చిన ధాన్యం సైతం నీటి పాలైయింది. పంట పొలాల్లో కోతలు కోసిన పనలు నీట మునగడంతో రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే మాజీ జడ్‌పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు మండలం లోని వలసపాకల, వాకాడ, పెదకొత్తూరు, కరప గ్రామాల్లో పర్యటించారు. తక్షణమే నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. **పెద్దాపురం** మండల పరిధిలోని వరి పండించే సుమారు 16 గ్రామాల ఏటి పట్టు రైతులు 50 శాతం పైగా వరి కోతలు పూర్తి చేశారు. ఇంకా చాలా వరి పొలాల్లో కోతలు పూర్తయి పనల మీద ఉన్నాయి. 20 శాతం వరకు నూర్చిన ధాన్యం కళ్లాలపై ఉంది. కొంతవరకు కుప్పలు వేసి ఉంది. తుపాన్‌తో కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని గుట్టలు వేసి తార్పాలిన్లు వేసి కాపాడుకున్నారు.



గండేపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



యు.కొత్తపల్లిలో ఈదురుగాలులకు ఎగిరిపోయిన పెంకులు



యు.కొత్తపల్లి మండలంలోని పునరావాస కేంద్రంలో నిర్వాసితులు

కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - కాకినాడ

తుపాన్ వలన పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి నిబంధనలు సడలించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో సగం వరికోతలు పూర్తయి, ధాన్యం కళ్లాల్లో, ధాన్యం రాసుల్లో ఉందని, సగం పంట పొలల్లోనే ఉందన్నారు. సంచులు లేక, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందుల వల్ల రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రకటనలు అర్భాటం తప్పితే రైతాంగం మాత్రం దళారుల చేతుల్లో మోసపోతూనే ఉందని తెలిపారు. ఆర్‌బికెలు కేవలం నమోదు కేంద్రాలుగానే పరిమితం అవుతున్నాయని రాజశేఖర్ అన్నారు. తక్షణమే రైతాంగాన్ని ఆదుకునే చర్యల్లో భాగంగా ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్టానికి సంబంధించిన సర్వేను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం తేమ శాతం పేరుతో పెట్టిన నిబంధన వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పంట పండించిన కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాజశేఖర్ కోరారు. నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేసి సకాలంలో నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రధాన కాలువల్లో పూడికను తొలగించాలి

-నగరంలో పర్యటించిన సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర శివార్లలో ప్రధాన కాలువల్లో పూడికను తొలగించి ముంపును నివారించాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. మంగళవారం సిపిఎం బృందం కాకినాడ నగరంలో రామకృష్ణారావు పేట, కామేశ్వరి నగర్, డైరీఫారం, సంజయ్ నగర్, పర్లోవపేట, సూర్యనారాయణపురం, ఏటిమొగ, గోళీలుపేట, జె.రామారావు పేట, మహాలక్ష్మి నగర్, ముత్తానగర్, జగన్నాధపురం రెల్లివీధి, అన్నమ్మ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ గతంతో పోలిస్తే ముంపు తగ్గుముఖం పట్టిందన్నారు. ఇటీవల నగరంలో నూతనంగా నిర్మించిన సిసి డ్రయిన్లు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల్లో వేసిన సిసి రోడ్స్ ముంపు నివారణకు తోడ్పడ్డాయన్నారు. అదేవిధంగా నగర పాలక సంస్థ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, కార్మికులు ముందస్తుగా తీసుకున్న చర్యలు కూడా రోడ్లపై ఎక్కువసేపు నీరు నిలవకుండా చేసిందన్నారు. నగర పాలక సంస్థ అధికారులు, కార్మికులకు సిపిఎం తరపున అభినందనలు తెలిపారు. అయితే జె. రామారావు పేట, మహాలక్ష్మి నగర్ ప్రాంతాల్లో కొన్ని వీధుల్లో నీరు నిలిచి పోయిందన్నారు. మురికినీరు గృహాల వాకిట్లోకి వచ్చేస్తుందన్నారు. శివార్లలో సముద్రపాయలను కలిపే మెయిన్ డ్రయిన్స్ పూడికలు క్లియర్ చేస్తే ఆయా ప్రాంతాల్లో ముంపు నివారణ జరిగే అవకాశం ఉందన్నారు. అదే విషయాన్ని అధికారులకు సోషల్ మీడియా ద్వారా తెలియచేశామన్నారు. పనులు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం కోరుతుందన్నారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు మలక వెంకట రమణ, ఆదర్శ్, జైరాం పాల్గొన్నారు.



నగరంలోని వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

వసతి గృహాల్లో తప్పని అవస్థలు

ప్రజాశక్తి - కాకినాడ

తుపాన్ ప్రభావంతో ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యా ర్థులు నానా అవస్థలు పడుతు న్నారని, ఐనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఆయా విద్యార్థులు కనీసం పట్టించుకో వడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ బృందం మంగళవారం వివిధ వసతి గృహాల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను కారణంగా సోమవారం, మంగళవారాల్లో కురిసిన వర్షం కారణంగా జగన్నాయక్‌పుర్ బిసి కళాశాల వసతి గృహంలో ఉన్న విద్యార్థులు నిద్రపోవడానికి కూడా వీలు లేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన భవనాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు వినతిపత్రాల రూపంలో తెలియపర్చినా పట్టించుకోకపోవడంతో విద్యార్థు లు నేడు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎం.వాసుదేవ్, ఇంద్రపాలెం గ్రామ కమిటీ కార్యదర్శి చిట్టూరి రోహిత్ పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నీటి గుంతలతో తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం నీటి గుంతలతో దర్శనమిస్తోంది. నూతన భవనం ప్రారంభించి 2 సంవత్స రాలు ఐనా నేటికీ కార్యాలయం ఎదురుగా రహదారి నిర్మించలేదు. దీంతో గోతులు మయంగా రహదారి తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరి తహశీల్దార కార్యాలయ ఆవరణ అంతా నీటి గుంటలతో స్వాగతం పలుకుతోంది. ఈ రహదారి మీదుగానే ఐసిడిఎస్, హౌసింగ్, ఉపాధి హామీ, సబ్ రిజిస్ట్రార్, ఎపిఎం కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వెళ్లాలంటే అధికారులు, సిబ్బంది, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.



నీటి గుంటలతో తహశీల్దార కార్యాలయం ఆవరణ

నిబంధనలను తొలగించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యంపై ప్రభుత్వం పెట్టిన నిబంధనలు తొలగించి, ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాయకులు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. పోలేకుర్రు, జార్జిపేట, లచ్చి పాలెం గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 60 శాతం కోతలు పూర్తియినా 30 శాతం ధాన్యం కళ్లాల్లోనే ఉందన్నారు. తేమ శాతం పేరుతో బస్తాకు 3 నుంచి 5 కేజీల వరకు కోత విధిస్తుండటంతోపాటు, రూ.2 వందల నుంచి రూ.3 వందల వరకూ తక్కువకే కొంటున్నారని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు పెట్టుబడి రావడం లేదని ఎటువంటి కటింగులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తుపాను తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా వేయాలని, సాగుదారునికే పంట నష్టం ఇచ్చేటట్టు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పర్యటనలో మద్దా సత్యనారాయణ, కొంకే సత్యనారాయణ, పెండెం జాను, లోవరాజు, మీరా సాయిబు, కే. చిన్న సత్యనారాయణ, మద్ద సత్యవతి, పాశం నూకరాజు, బండ శ్రీరాములు, దడాల వాడపల్లి పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలకు వక్రభాష్యాలు తగదు

ప్రజాశక్తి - తాళ్లరేవు


యువగళం పాదయాత్రలో లోకేష్ చేసిన వ్యాఖ్యలకు వైసిపి నాయకులు చేసే వక్రభాష్యాలను మానుకోవాలని టిడిపి మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు హితవు పలికారు. తన నివాసంలో మంగళవారం స్థానిక రైతులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చొల్లంగిలో ఎకరం రూ.15 లక్షల విలువ చేసే భూమిని ప్రభుత్వం రూ. 50 లక్షలకు కొనుగోలు చేసిందని లోకేష్ అన్నట్లు వైసిపి నాయకులు మీడియా సమావేశంలో చెప్పారని, ఆ విధమైన వ్యాఖ్యలను తమ నాయకుడు లోకేష్ చేయలేదని అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో పలు ప్రాంతాలను ఉద్దేశించి లోకేష్ మాట్లాడారని వివరించారు. ప్రభుత్వ అవసరాలకు భూమి కొనుగోలు చేసిన సమయంలో మార్కెట్ ధర ప్రకారం చెల్లించలేదని చొల్లంగి ప్రాంతానికి చెందిన రైతులు ఆందోళనకు దిగిన సంఘటనలు గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో గర్రె లక్ష్మీనారాయణ, ఈతముడి రాఘవ, శ్రీపాదం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో కొనసాగిన రిలే నిరహార దీక్ష

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తమ స్వాధీనంలో ఉన్న గుర్రప్పాలెం సీలింగ్ భూములను ఎంఎల్ఎ అనుచరులకు కట్టబెట్టే కుట్రలకు నిరసనగా చేపట్టిన రిలే నిరాహారదీక్ష 9వ రోజు హోరున వర్షంలోనూ కొనసాగింఇ. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలను లెక్కచేయకుండా తమ డిమాండ్ సాధన కోసం దీక్షను కొనసాగిస్తున్నట్లు ఎపిఆర్‌సిఎస్ ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. 9 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న అధికారుల్లో ఎటువంటి చలనం లేకుండా పోయిందన్నారు. ఆర్‌డిఒ మంగళవారం మండలంలో పర్యటించారని, దళితులు, పేదలు చేస్తున్న ఆందోళనను సైతం పట్టించుకోకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. దళిత, పేదల పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నట్లా? లేనట్లా ?అని ఆంజనేయులు ప్రశ్నించారు. జగ్గంపేట ఎమ్మెల్యే సీలింగ్ భూముల సాగుదారులకు అన్యాయం చేయాలని చూస్తే , తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ నాయకులు బి. రమేష్, కొండ దుర్గారావు, కుంచే అంజిబాబు, దేశెట్టి సురేష్, నారాయణమూర్తి, చేదులూరి లక్ష్మి, వడ్లమూడి ఏసురత్నం, వెంకటరమణ, లావణ్య, లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



ఈ పథకంలో మొదటిది ఫెయిల్యూర్ సార్... రెండోదే బాగా సక్సెస్ అవుతోంది!

మూడు తరాల నుంచి అక్రమ వ్యాపారాలే...

ప్రజాశక్తి - కాకినాడ

తన మూడు తరాల కోసం ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఎన్నో గొప్పలు చెప్పుకుం టున్నారని, కానీ ఆయన కుటుంబం మూడు తరాలూ అక్రమాలు, అన్యాయాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే ఈ స్థాయికి వచ్చా యని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ధ్వజమె త్తారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్వారంపూడి మూడు తరాలు నల్లమందు, గంజాయి, దొంగ నోట్లు చెలామణి, అక్రమ బియ్యం వ్యాపారాలే సాగించారని ఆరోపించారు. ఏనాడు ప్రజాహిత కార్యక్రమాలు చేసిన దాఖలాలు లేవని విమర్శం చారు. ఇతరుల కుటుంబాలను విమర్శిస్తున్న ఆయనను చూసి వారి చీకటి వ్యాపార చరిత్ర తెలిసిన ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య మైన రీతిలో స్పందన వచ్చిందన్నారు. ప్రజల స్పందనను చూసి ఓర్వలేకనే యువగళం పాద యాత్రపై ద్వారంపూడి తన అక్కసును వెళ్లగక్కారని అన్నారు. కాకినాడలో బహిరంగ సభ విజయవంతం కావడంతో వైసిపి నాయకులకు కంటి మీద కునుకు రాక అవాకులు..చవాకులు పేలుతున్నారని మండి పడ్డారు. నగరంలో ద్వారంపూడి భూకబ్జాలు, అరాచ కాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. తమ లోకేష్ నాలుకను చీరేస్తానని అంటున్న ద్వారంపూడికి 2024 ఎన్నికల్లో నాలిక చీరేస్తానని అన్నారని 2024 ఎన్నికల్లో ద్వారంపూడిని చీరేయ డానికి కాకినాడ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ద్వారంపూడి మాదిరిగా తాను వ్యక్తిగతంగా విమర్శంచగలనని, కానీ తనకు సంస్కారం అడ్డు వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎం.వీరు, పి.రవి, టి.రమేష్, బి.సత్యనారాయణ, జి.లక్ష్మణరావు, శేఖర్, ఎస్.ఎ.తాజుద్దీన్, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తమ డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 8న తలపెట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని జగ్గంపేట మండలం అంగన్‌వాడీ అధ్యక్ష, కార్యదర్శులు రత్నం, సుజాతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాల పెంచాలని, రాష్ట్రంలో అంగన్‌వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టిఎ బిల్లులు, ఇతర బకాయిలను వెంటనే అమలు చేయాలని, తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీన మండల కేంద్రమైన జగ్గంపేటలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె జరుగనుందని వారు తెలిపారు. ఈ సమ్మెకు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - కాజులూరు

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని జగన్నాథగిరి, ఆర్యవటం, తర్లంపూడి, చేదువాడ, కాజులూరు గ్రామాల్లో తహశీల్దార్ సత్యనారాయణతో కలిసి సంయుక్తంగా పంట పొలాలను తడిచిన ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి అవుతున్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు 90 శాతం మాసూళ్లు పూర్తయ్యాయని, ఇక 10 శాతం మాత్రమే కోతలు కోయాల్సివుందన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సమాజ అభివృద్ధికి, మానవాభివృద్ధి కొరకు యువత ముందుండాలని శారదా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా సమితి అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో జరుపుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతుల నిర్వహణ, పేదలకు బియ్యం పంపిణీ, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, తదితర సమాజ సేవా కార్యక్రమాలలో యువత పాల్గొని మరింత పెద్ద ఎత్తున వాటిని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు టివివి.సత్యనారాయణ, నువ్వుల బాబ్జి, సూర్య చంద్ర రావు, తెలుగుంట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సర్పవరం సిఐ ఆకుల మురళీ కృష్ణ వివరించారు. గ్రామానికి చెందిన తిరగటి వీరభద్రరావు సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో విద్యుత్ కోతతో నెట్ సదుపాయం లేకపోవడంతో సోమవారం సాయంత్రం భార్యతో కలిసి గుడారి గుంట అత్తవారింటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగల గొట్టి తలుపులు తెరిచి ఉండడడం గమనించిన ఇంటి యజమాని వీరభద్రరావు సర్పవరం పోలీసులు సమాచారం అందించారు. ఈ చోరీలో సుమారు 40 కాసుల బంగారంతోపాటు, రూ.1.50 లక్షల నగదును ఎత్తుకు పోయినట్లు కుటుంబ యజమాని తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని డిఎస్పి మురళీకృష్ణ రెడ్డి, క్రైమ్ డిఎస్పి రాంబాబు, ఐటి కోర్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ మేరకు ఎస్ ఐ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు రేషన్ షాపుల సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణంలోని కమ్మరి వీధి, ఉప్పువారి వీధుల్లో 2 రేషన్ దుకాణాలను విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ దాడులు సీజ్ చేశారు. రేషన్ సరుకులను అక్రమంగా పక్కదారి పట్టిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏకకాలంలో మంగళవారం రేషన్ షాపులను తనిఖీలు చేశారు. సరుకుల నిల్వల్లో పెద్దఎత్తున తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దానితో దుకాణాలను అధికారులు సీజ్ చేసి డీలర్లపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు.

విద్యుత్ షాక్‌కు గేదె మృత్యువాత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమో..ప్రజలు, రైతుల అజాగ్రత్తతో కరెంటు తీగలు మూగజీవాల పాలిట యమపాశాలు అవుతున్నాయి. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ తీగలు, ఎళ్ల తరబడి మరమ్మతులు, నిర్వహణ లేక చిన్నపాటి గాలికే తెగిపడే వైర్లు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఎర్తింగ్ లోపాల కారణంగా పదుల సంఖ్యలో మూగజీవాలు కరెంట్ షాక్‌కు గురై మత్యువాత పడుతున్నాయి. మంగళవారం రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో చోటుచేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పెంకే అప్పారావు రైతు 6 గేదెలను మేపుతూ ఇచ్చిన పాలును అమ్మి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం గేదెలను మేతకు తోలుకెళ్లాడు. సోమవారం రాత్రి కురిసిన గాలి వాన బీభత్సానికి వాకలపూడి రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడాన్ని గమనించని రైతు యథావిధిగా అదే మార్గంలో గేదెలను తోలుకెళ్లాడు. ఈ క్రమంలో పాడి గేదెకు కరెంట్ షాక్ తగలి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.60 వేల వరకూ ఉంటుందని యజమాని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ ఆధ్వర్యంలో మృతి చెందిన గేదెకు పంచనామా నిర్వహించారు. విద్యుత్ శాఖ తరపున ఆర్థిక సాయం అందించి తనను ఆదుకోవాలని రైతు కోరారు.

మురమండలో 'వికసిత్ భారత్'

ప్రజాశక్తి-కడియం

మురమండ సర్పంచ్ అయినవల్లి రుక్మిణి, ఎంపిటిసి సభ్యుడు మెల్లిమి మంగా గంగరాజు అధ్యక్షతన మురమండ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా బిజెపి నాయకుడు బొరుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న 20 సంక్షేమ పథకాలు గురించి హాజరైన వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి కౌశల్ యోజన, అమత్ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, బేటీ బచావో బేటి పడావో మేకింగ్ ఇండియా, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి విశ్వ కర్మ యోజన, మొదలగు 20 సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్‌లు, ఆయుష్మాన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మురమండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మండల ఉద్యాన అధికారి సుధీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి వెలుగు ఎపిఎం నీలి సూరిబాబు, సిసి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు,

నీట మునిగిన ఆనంద నిలయం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో మిచౌంగ్ తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఆనంద నిలయం బిల్డింగ్ నీట మునిగింది. దీంతో విద్యార్థులు కూర్చోవడానికి కూడా చోటు లేక నిలబడే ఉన్నారు. స్థానికుల సకారంతో దగ్గరలో ఉన్న ఎంపిపి పాఠశాల నెం (1) కు విద్యార్థులను తరలించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ సంబంధిత భవనాన్ని పునర్నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు ఈ సమస్యను ప్రజాప్రతినిధులకు, స్థానిక ఎంఎల్ఎ తలారివెంకట్రావుతోపాటు జిల్లా అధికారులందరి దృష్టికి తీసుకువెళ్లానని, వాట్సాప్ ద్వారా తెలియజేయడమే కాకుండా గ్రూపుల్లో సైతం పోస్ట్ చేయగా యంత్రాంగం అంతా చూశారని వార్డెన్ కె.ధర్మయ్య అన్నారు. ఎవరు ఇప్పటివరకు స్పందించ లేదన్నారు. తద్వారా ఇలాంటి పరిస్థితిని బట్టి వేరే విద్యార్థులు ఇక్కడ జాయిన్ అయ్యేందుకు ఇష్టపడడం లేదు అని తెలిపారు.

విద్యుత్ సరఫరా లేక అవస్థలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మిచౌంగ్ తుపాను బీభత్సానికి తోడు మండల ప్రజలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. భారీ వర్షం, గాలులకుకమ్యూనికేషన్ వ్యవస్థ దాదాపు కుంటుపడిపోయింది. మండల విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపోయిన లైన్లను రిపేర్ చేసి, సరఫరా పునరుద్ధరింప చేస్తున్న ప్పటికీ, మండలం మొత్తం ఒకేసారి ఇబ్బంది ఏర్పడటంతో, గ్రామాల ప్రజలు లైన్మెన్లు లేకపోవడంతో ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు నిడదవోలు ప్రాంతంలో టోర్నడోలు కూడా బీభత్సం సష్టించడంతో ప్రజలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

చెరువును తలపిస్తున్న రోడ్లు



జగ్గంపేటలో చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రమైన జగ్గంపేట హైవే సర్వీస్ రోడ్ లో నీరు నిల్చిపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. సర్వీస్ రోడ్ కోసం సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. హైవే డ్రయినేజీ పూడిక తీయకపోవడంతో మురిగినీటి ప్రవాహం లేకుండా పోయింది. దీంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. గోకవరం రోడ్ లో ఉన్న పోలవరం వంతెన మొత్తం నీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రయినేజ్ పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంటకు నష్టం జరగకుండా వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటించాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సిహెచ్.వి.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలను కోయరాదన్నారు. పూర్తిగా ఆరిన వరి పనలను తుపాను సమయంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేయాలని సూచించారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారి చేయాలన్నారు. కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచు కోవాలన్నారు. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తటమే కాకుండా రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టాలన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని బియ్యంగా కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకుంటే కొంత మేరకు నష్టం తగ్గించవచ్చారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ- 2024 లో భాగంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఓటరు ప్రత్యేక శిబిరంలో వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు(వైసిపి), తుమ్మల రమేష్ (టిడిపి) అప్పారావు(బిఎస్పి), డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎఇఆర్ఒలు మురళీకృష్ణ, జాన్‌బాబు, హరిదాసు, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఆక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎల్ఎ ద్వారం పూడి చంద్రశేఖర్ రెడ్డి అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని జనసేన పిఎసి సభ్యులు పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) తెలి పారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి విషయంలో తాను తొందరపాటులో మాట తూలిన విషయం పట్ల అప్పుడే విచారం వ్యక్తం చేశానన్నారు. తాను రైతుల కష్టాల కోసం మాట్లాడుతుంటే ఎంఎల్ఎ ద్వారంపూడి తనపై వ్యక్తిగతంగా దూషణకుల దిగుతున్నారని అన్నారు. త్వరలోనే ఆయన భాగోతాన్ని బహిరంగ పర్చేందుకు వెనకాడేది లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా కురసాల కన్నబాబు రైతుల వద్ద నుంచి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. తన తండ్రి ఎంతో గౌరవ మర్యాదలతో మెలిగారన్నారని, సమాజం పట్ల హుందాగా, బాధ్యతతో తమ కుటుంబం వ్యవహరిస్తుందని తెలిపారు. తాను కాంట్రాక్టులు చేసినా ఎవరినీ మోసం చేయలేదన్నారు. వైసిపి సీనియర్ నేత, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వంటి వారిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నానాజీ హెచ్చరించారు. ఈ సమావేశంలో తోట శ్రీరామకృష్ణ, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందరాజులు, పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఓల్డేజ్ హోమ్ ద్వారా ఆహారం పంపిణీ



తుపాన్ బాధితులకు భోజనం అందిస్తున్న హోం సిబ్బంది

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదేశాలతో గత రెండు రోజులుగా యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సుమారు 4000 మందికి పైగా భోజనం ఏర్పాటు చేసి ఓల్డ్ ఏజ్ హోం సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సడలించి ధాన్యంను కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, సెక్రటరీ వి.రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటనను విడుదల చేశారు. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లాలో తడిసిన ధాన్యం రాశులు, పంట పొలాల్లోని పంట నీట మునిగిందని అన్నారు. పంట నీట మునగడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

వికలాంగుల దినోత్సవం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 6న స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణంలో నిర్వహించాల్సిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలను తుపాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శర్మ, చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, వారి తల్లిదండ్రులు గమనించాలని, ఈ వేడుకలను ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియ చేస్తామని చెప్పారు.

రక్షణలో నౌకాదళం కీలక పాత్ర

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

భారతదేశ సముద్ర ప్రయోజనాల రక్షణకు నిరంతరం బాధ్యతగా పనిచేస్తున్న సంస్థ నౌకా దళమని ఆ సంస్థ విశ్రాంతి అధికారి చావలి రామచంద్ర ప్రసాద్ అన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత నౌకా దళ వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో భారత నౌకాదళం సాధించిన విజయాలు, దేశ రక్షణలో వారి పాత్రను గుర్తించడానికి డిసెంబర్ 1 నుంచి 7 వరకు నౌక దళ వారోత్సవాలను జరుపుకుంటామని అన్నారు. సముద్ర సరిహద్దులను సురక్షితం చేయడం తోపాటు మానవతా విపత్తు ఉపశమనం మొదలైన వాటి ద్వారా భారతదేశం యొక్క అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడం లో నౌకాదళం పాత్ర మరువలేనిదన్నారు.

పరికరాలకు నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రనాయుడు, రఘురామ్

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రయోగశాలలో పరిక రాలకు నిధులు మంజూరు చేయాలని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ బృందాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఇ.చంద్రనాయుడు, కళాశాల డవలంప్‌మెంట్ కమిటీ కార్యదర్శి ఒప్పి రఘురామ్ కోరారు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ స్వతంత్ర డైరెక్టర్ చిలుకూరి రామ్ కుమార్ సారధ్యంలో ఇతర డైరెక్టర్లు మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల మౌలిక వసతులు సంతప్తికరంగా ఉన్నాయని బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. కళాశాలలో ప్రయోగ సాలలో తగిన ప్రయోగాలను నిర్వహించడానికి విద్యార్థులకు తగిన ప్రయోగపరికారాలు అందుబాటులో లేవని, కావున సిఎస్ఆర్ నుంచి నుంచి కళాశాలకు ప్రయోగశాల పరికరాల ఏర్పాటుకు మరియు కంప్యూటర్ల సరఫరా కొరకు నిధులు మంజూరు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ బృందం సిద్దార్థ మన్నవ, మేనేజర్ ఎ. దుర్గాప్రసాద్, జాయింట్ జనరల్ మేనేజర్, ఎంపిడిఒ వసంతకుమార్ పాల్గొన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరూ కృషి చేయాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కారాక్యలయంలో ఆయన అధ్యక్షతన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరు తూచా తప్పక పాటించాలన్నారు. నూతన ఓటర్ నమోదుకు సంబంధించి 1477 అప్లికేషన్లు, మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి సంబంధించి 647, ఓటరు జాబితాలో సవరణలు, చేర్పులకు సంబంధించి 748 అప్లికేషన్లు అందాయన్నారు. ఈ అప్లికేషన్లకు సంబంధించిన వివరాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు(వైసిపి), రంది సత్యనారాయణ(టిడిపి), నీలపాల సూరిబాబు(సిపిఎం) పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు

నాయీ బ్రాహ్మణ సంఘ వన సమారాధన

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజవర్గంపరిధిలో నాయీబ్రాహ్మణ సంఘం వనసమారాధన కార్యక్రమం మంగళవారం ద్రాక్షారామలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆచంట సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. నాయీబ్రాహ్మణ సంఘం అభివద్ధికి బలోపేతానికి సంఘ సభ్యులంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మండల కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ అలీషా, మాజీ ఎంపిటిసి సభ్యులు దడాల రవికుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు చింతలపూడి సత్తిబాబు, సెక్రటరీ సుందరపల్లి వెంకటేశ్వరరావు, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు జగన్నాథం, మాజీ అధ్యక్షులు దండకడియల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఉపాధి హామీ చట్టంలో భాగంగా పంచాయతీ రాజ్, మరియు పెన్షన్లపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి-2 సానబోయిన నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేసిన పనుల వివరాలు, చెల్లింపులు, జాబ్‌కార్డు ద్వారా చెల్లింపులు, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, పెన్షన్లలో ఎక్కుడ అయి నా లోపాలు ఉన్నాయా వంటి అంశాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది భాద్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర రావు, అంబుడ్స్ మెన్ జ్యోతి, డిఆర్‌డిఎ డిపిఎం అన్నపూర్ణ, ఎంపిడిఒ కె.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల సవరణ, నమోదుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓట్ల సవరణ, ఓట్ల నమోదు తదితర అంశాలపై శని, ఆదివారాల్లో జరిగిన స్పెషల్ క్యాంపన్లో వచ్చిన దరఖాస్తులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్.సుధాసాగర్ మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, పలు పార్టీల రాజకీయ నాయకులతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాముకుమార్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, మండల పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో అభిషేక్ ప్రతిభ



రన్నర ట్రోఫీతో బోస్ అభిషేక్

ప్రజాశక్తి-రామచంద్రపురం

బెంగళూరు వేదికగా జరిగిన కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో మోడరన్ విద్యార్థి బోస్ అభిషేక్ ప్రతిభను చాటాడు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5 వరకు జరిగిన యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్-2023లో పట్టణానికి చెందిన మోడరన్ హైస్కూల్ విద్యార్థి బోను అభిషేక్ అండర్-15 డబుల్స్ కేటగిరీ నందు ఆల్ ఇండియా లెవెల్‌లో ద్వితీయస్థానం సాధించి రన్నర్ గా నిలిచినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ అభిషేక్ రూ.15 వేలు నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్నారని వివరించారు. అభిషేక్ మరో విజయాన్ని దక్కించుకోవడం సంతోషదాయకం అని అన్నారు. మోడరన్ హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా ప్రతీ టోర్నమెంట్ నందు ప్రతిభ చూపుతున్న అభిషేక్ భవిష్యత్‌లో దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడు కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ తన వరుస విజయాల పరంపరకు వెన్నుదన్ను గా నిలుస్తున్న అంశాలు తల్లిదండ్రుల విశేషమైన ప్రోత్సాహంతో పాటు తన ప్రతిభకు మద్దతుగా నిలుస్తున్న మోడరన్ కరస్పాండెంట్ జివి.రావు అని ధన్యవాదాలు తెలిపాడు. ఈ సందర్భంగా అభిషేక్‌కు హెచ్.ఎం.ముత్యాల చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

నేడు కుల గణనపై సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, సచివాలయాల వెల్ఫేర్స్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

సమస్యలపై పోరాడే వారికి అండగా జనసేన

ప్రజాశక్తి-గోకవరం

సిఎం జగన్‌ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన హామీ ప్రతి పేదవానికి ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇస్తానని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. కానీ ఇది ఎక్కడా ఆచరణలో మాత్రం సాధ్యం కావట్లేదన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎవరు పోరాడినా వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు గడిచిపోయినా గోకవరంలో ఇళ్ల స్థలాలను గుర్తించలేదన్నారు. ఈ ఇళ్ల స్థలాల సమస్యపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఈ సమస్యపై స్పందించలేదన్నారు. ఇదే సమస్యపై అధికార పార్టీ గోకవరం మండల ఎంపిపి సుంకర శ్రీవల్లి, సుంకర వీరబాబు మీడియా ముఖంగా అధికారులను ప్రశ్నించడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ఈ సమస్యపై స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలను అందించాలన్నారు.



అరటి గెల

అబ్బురపరుస్తున్న ఏడు అడుగుల అరటి గెల

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సాధారణంగా అరటి గెల రెండు అడుగుల నుంచి మూడు అడుగుల వరకు ఉంటుంది. ఉచ్చిలి గ్రామానికి చెందిన భూపతి రాజు సుబ్బరాజు తన పొలంలో సేంద్రియ ఎరువులతో పెంచిన అరటి చెట్టు ఏడడుగులు భారీ స్థాయిలో అరటి గెల వేయడంతో అందరిని అబ్బుర పరుస్తోంది. జన్య పరివర్తన చెందటంతో పాటు భూమి లో సారవంతం ఎక్కువైనప్పుడుభారీ స్థాయిలో అరటి గెలల వేస్తాయని ఉద్యాన అధికారులు చెబుతున్నారు.